**కథ**

# కొన్ని చినుకులు కురవాలి

డా॥ వి. చంద్రశేఖరరావు



**సునీతకు ఇంకా కొత్తగానే ఉంది. నగరపు భాష ఇంకా అంతుపట్టలేదు. అపార్ట్‌మెంటు అనే చెరసాల వదిలిపెట్టి రోడ్‌పైకి వస్తే, అది కూడా పెద్ద జైలులా ఉంది ఆమెకు. ఎవరూ ఎవరితో మాట్లాడరు. నిరంతరం ప్రయాణిస్తూనే ఉంటారు. నలుగురు కలిసి మాట్లాడుకునే సందర్భాలుండవు.**

**అపార్ట్‌మెంట్లు (లేదా ఇళ్ళు) దాటి బయటకు రారు. కనీసం పక్క ఇళ్ళలోకి కూడా. రోడ్లన్నీ కిక్కిరిసి ఉంటాయి.**

**నడుస్తున్నవాళ్ళు ఒంటరి ప్రయాణికుల్లా ఫీలవుతారు. ఇప్పుడు మనుషుల పలకరింపు ఒక ముఖ్య అవసరం సునీతకు. అట్లాగే ఒక ఆకుపచ్చని పొద (చెట్టు) కోసం వెతుకుతుంది సునీత. నగరంలో దొరకని మరో వస్తువు ఆకుపచ్చని చెట్టు. పార్కులు, వాటిల్లో చెట్లు ఉంటాయిగానీ, అవి ప్లాస్టిక్ చెట్లలా, జీవం లేనట్లుగా ఉంటాయి. సునీత వెతికే మరో అనుభవం, నిశ్శబ్దం. శబ్దాలు, చప్పుళ్ళు లేని క్షణాలు. రాత్రి పదకొండు అయినా రోడ్డుపైన చప్పుళ్ళు ఆగిపోవు. సునీత వాళ్ళది రోడ్డు పక్కనున్న అపార్టుమెంటు. కిటికీలన్నీ వేసినా శబ్దాలు తోసుకొని లోపలికి వస్తాయి. చౌరస్తాల మధ్య మంచం వేసుకొని పడుకొన్నట్లుగా ఉంటుంది, రాత్రి వేళల్లో.**

మోహన (ఆమె చెల్లి) జాగింగ్ కోసమని వెళ్ళి, పొద్దున్నే ఒక పూలగుత్తితో వస్తుంది. రంగురంగుల పూలు, గులాబీలు, దాలియాలు, చామంతులు ఇంకా ఎన్నో. అద్భుతమైన అందమేగాని, వాటిలో గుండెల్ని తట్టే సుగంధం ఉండదు. ఈ పూలలాగే అయిపోయిందా జీవితం, అని దిగులుపడుతుంది సునీత. ఏ చిన్న సందర్భం వచ్చినా, తమ వూరు గురించి, మహావనం అనదగ్గ చెట్ల గురించి, ఆ చెట్ల మధ్య నున్న తమ పెంకుటిల్లు గురించి గంటలు గంటలు మాట్లాడుతుంది. విసుగ్గా చూస్తుంది వాళ్ళమ్మ. "సునీ, కొద్దిగా వాస్తవంలోకి రా. ఎన్నాళ్ళిలా కూలిపోయిన జ్ఞాపకాల్ని పట్టుకొని వేలాడుతావు" అంటుంది. ఆమె చెప్పేది, వాళ్ళు అమ్మేసిన ఇంటి గురించి మాత్రమే కాదు, సునీత గతం గురించి కూడా. తల్లి కళ్ళలో నీళ్ళు చూసి కంగారు పడుతుంది సునీత. గిల్టీగా ఫీలవు తుంది. వాళ్ళమ్మ, కళ్ళలో నీళ్ళు అలా కారుతుండగానే "హైదరా బాదు, ఒక సరికొత్త దేశం. మనవాళ్ళు చాలామంది ఉన్నారు ఇక్కడ. దేవుడి దయవల్ల డబ్బుకు ఇబ్బంది లేదు మనకు. పిన్నివాళ్ళతో కలిసి బోతిక్ పెడుతున్నాము. వాళ్ళ జాయింట్(హోటల్)లో వాటా ఇస్తామంటున్నారు. అపార్టుమెంటు చూశావు కదా, ఇదంతా పోష్ ఏరియా" అంటూ వివరిస్తుంది. తల్లి ఫక్తు బిజినెస్ మనిషిలా మాట్లాడుతుంటే ఆశ్చర్యం వేస్తుంది సునీతకు. మారుమూల గ్రామంలో (గుంటూరు శివార్లలోని) స్కూలు టీచర్‌గా పనిచేసే భూదేవమ్మ, దేవి మేడమ్‌గా మారిపోయిన వైనం (ఆరు నెలల్లోనే) ఆమెకు అద్భుతంగా ఉంది. తల్లి, (చెల్లి కూడా) రూపాంతరం అయినంత సులువుగా, సునీత ఈ కొత్త కాంక్రీటు లోకానికి అడ్జెస్టు కాలేకపోయింది.

"హరిప్రసాద్‌ని డిన్నర్‌కు పంపిస్తానంది పిన్ని. అతనితో కాస్త చనువుగా, కలుపుగోలుగా ఉండడానికి ప్రయత్నించు" అంది తల్లి, తన మాటలకు కొనసాగింపుగా. ఇదో కొత్త అనుభవం సునీతకు. అపరిచిత మైన నాటకంలోకి ప్రవేశపెట్టబడ్డట్టుగా ఉంది. ఈ హరిప్రసాద్ ఏ ఉపోద్ఘాతం లేకుండా వాళ్ళ ప్రపంచంలోకి వచ్చాడు. నలభై యేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. డైవోర్సీ. వాళ్ళ కులంవాడే. అతనితో ప్రేమ నటించాలి. అతని తొమ్మిదేళ్ళ కూతురుతో ప్రేమ నటించాలి. మాంత్రికురాల్లా మొత్తం జీవితాన్ని మార్చేయాలని చూస్తుంది వాళ్ళ అమ్మ. ఒక మామూలు స్కూలు టీచరు ఇంతలా ఎలా మారిపో గలిగింది అని ఆశ్చర్యపడుతుంది సునీత. కొత్తగా వచ్చిన డబ్బు (పొలాలు ఇళ్ళ స్థలాలు అమ్మగా వచ్చినవి) తెచ్చిన మార్పా, లేదా హైదరాబాద్ అనే మోడరన్ సంత తెచ్చిన మార్పా అని తర్కిస్తుంది.

"నార్మల్‌గా ఉండడానికి ప్రయత్నించు" అంటుంది సునీతతో వాళ్ళ అమ్మ. నార్మల్ అంటే ఏమిటో ఇంకా సునీతకు అర్థం కాలేదు. ఒకళ్ళ

నుంచి ఒకళ్ళు విడిపోయి, ఏకాంత ద్వీపాలు కావటం, నేను, నాది, చుట్టూ అల్లుకుపోయే సంబంధాలు. గంటలు గంటలు మనుషుల మధ్య దొర్లే మాటలన్నీ ఈ నేనుల గురించే. ఈ కొత్త జీవితపు రూల్స్ ఇంకా సునీతకు అలవాటు కాలేదు.

నెలక్రితం సునీతవాళ్ళ పిన్ని ఇంట్లో పార్టీ జరిగింది. అట్లాంటి పార్టీల్ని చూడటం మొదటిసారి సునీతకు. రాత్రి రెండు గంటలవరకూ సాగింది పార్టీ. బీరు, విస్కీ, వోడ్కా, అదంతా తాగుబోతుల స్వర్గంలా ఉంది. అంతా మనవాళ్ళే (సునీత కులంవాళ్ళు). మనవాళ్ళ గురించిన చర్చే. సెంటు భూమి, లక్షల రూపాయలుగా మారిపోయిన కథలే, ఎక్కడ చూసినా, కొత్తకార్లు, నగలు, బట్టల దుకాణాలు, మాల్స్‌లో షాపింగ్ అనుభవాలు. ప్రముఖులతో వాళ్ళ పరిచయాలు, వాళ్ళకు సేవ చేసి వీళ్ళు తరించిన తీరు, ఇదంతా చూసి సునీతకు దిగులు వేసింది. ఎవరితోనూ నిముషం సేపు మించి మాట్లాడలేకపోయింది. విగ్రహంలా ఒక మూలన నిలబడి ఉంది. ఆ పార్టీలోనే సునీత పిన్ని, హరిప్రసాదుని పరిచయం చేసింది. అతను చనువుగా సునీత భుజాలపై చెయ్యి వెయ్యటం, ఆమె శరీరం గురించి, అందం గురించి కాంప్లిమెంటు చెయ్యటం చూసి షాకయింది. సునీత పిన్ని, రెండు మూడుసార్లు, మనవాడే, మనవాడే అంటూ గుర్తుచేసింది. "డెల్‌లో ఉద్యోగం. సంవత్సరానికి పదిలక్షలపైనే జీతం. విస్పర్‌వాలీలో డూప్లెక్స్ హౌస్ ఉన్నాయి. ఈ మధ్యనే స్కోడా కారు కొన్నాడు" అని అతని గురించి వివరాలు చెప్పింది సునీత పిన్ని. దాదాపుగా ఆ సంబంధాన్ని ఖాయం చేసినట్లుగా మాట్లాడింది.



అయితే సునీత తల్లిలో, ఇంకా పూర్తి తడి ఆరిపోలేదు. అందుకే సునీతలో కలిగే మార్పు, క్రమంగా నెమ్మదిగా జరగాలని ఆరాటపడు తుంది. రాత్రుళ్ళు, ఇంట్లో ఇదే చర్చ. తొమ్మిదేళ్ళుగా సునీతలో ఒక మొద్దుబారినతనం పేరుకుపోయింది. ఆమె, తనచుట్టూ నల్లని తెరను చుట్టుకుంది. ఆ తెరను చీల్చి, సునీతను బయటకు లాగాలని తల్లి ప్రయత్నం.

రెండు రోజుల క్రితం, సునీత, వాళ్ళ బంధువుల ఇంటికి వెళ్ళింది. ఇంటివాళ్ళ అమ్మాయి, అమెరికా నుంచి వచ్చింది (సాఫ్ట్‌వేర్ ఇంజనీరు). ఇల్లంతా ఎలక్ట్రానిక్ వస్తువుల మ్యూజియంలా ఉంది. సునీతకు ఆ యిల్లు, శపించబడ్డ ఇల్లులా తోచింది. అందరూ పొడి పొడిమాటలే మాట్లాడుతున్నారు. ఇంటివాళ్ళ అమ్మాయి కళ్ళలో సన్నటి నీటితెర కనబడింది సునీతకు. భోజనాలు అయినాక విషయం బయటపడింది. ఆ అమ్మాయిని భర్త వెళ్ళగొట్టేడని. ప్రతిరోజూ ఆమెను హింసించేవాడని. ఆమె బ్యాంక్ బాలన్సు మొత్తం (80 లక్షలదాకా) తీసేసుకొని, డైవోర్సు కాగితాలపై సంతకాలు తీసుకొని, ఇండియా పంపించాడని. ఆ అమ్మాయి పెద్దగా ఉద్వేగాల్ని చూపలేదు. ఆ అమ్మాయి జాకెట్ కింద పూర్తిగా మానని గాయం ఒకటి సునీత కంట బడింది. హఠాత్తుగా సునీత ఏడవటం మొదలుపెట్టింది. అందరూ కంగారుపడ్డారు. సునీతకు కూడా తెలుస్తుంది. ఆమె ప్రవర్తన సహజంగా లేదని; కానీ ఆ దుఃఖం సునీత ఆధీనంలోలేనిది. అట్లా ఎవరి దుఃఖాన్ని అయినా చూస్తే తట్టుకోలేని పరిస్థితి. ఆమె లోపల బాధ ఏదో సముద్రంలా తన్నుకువస్తుంది. నిశ్శబ్దంగా ఉన్న ఆ యింటి మధ్యలో శోకదేవతలా చాలాసేపు ఏడ్చింది. సునీత తల్లి ముఖంలోని కోపం, విసుగు, సునీతకు తెలుస్తున్నాయి గానీ, తనను తాను కంట్రోలు చేసుకోలేకపోవటం కూడా తెలుస్తుంది. సుమారు గంట తరువాత బంధువులమ్మాయి కళ్ళలో కూడా రెండుమూడు కన్నీటి బొట్లు రాలాయి.

మెల్లమెల్లగా సునీత హైదరాబాదును ఇష్టపడడానికి ప్రయత్నిస్తుంది. చెట్లు కనపడని పొడవాటి రోడ్లను ఇష్టపడ డానికి ప్రయత్నిస్తోంది. మైళ్ళ పొడవుండే షాపింగ్‌మాల్స్‌ని, సానుభూతిగా చూడడానికి ప్రయత్నిస్తోంది. పల్లెలలో కనపడే సంతలను గుర్తు తెచ్చుకొని, వాటితో పోల్చుకోడానికి ప్రయత్నిస్తోంది. సినిమాలు, మల్టీప్లెక్సులు, నెక్లెస్‌రోడ్డు, మెల్లగా వాటిని తన అనుభవాల పుస్తకంలోకి ప్రవేశపెట్టాలని చూస్తుంది. బంధువుల ఇళ్ళకు తరచుగా వెళ్ళటం అలవాటు చేసుకుంది. ఉత్సవ్, చట్నీస్, నాన్‌కింగ్, మినర్వాలాంటి హోటళ్ళలో డిన్నర్‌లను ఇష్టపడడానికి ప్రయత్నిస్తుంది.

ఒక ఆదివారం చెల్లెలు మోహన, సునీతను బ్యూటీ క్లినిక్‌కు తీసుకెళ్ళింది. సునీత ముఖంపై సుమారు రెండు గంటలపాటు, రకరకాల క్రీములతో దాడిచేసి, అందమైన బొమ్మలా తయారుచేశారు. "చాలా అందంగా ఉన్నావే" అంటూ కాంప్లిమెంటు చేసింది మోహన. "కానీ ముఖంలో ఏదో మిస్సు యింది" అని కూడా అంది. "లోపలంతా దుఃఖంతో నింపావు. అది నీ అందాన్ని మాస్కులా కప్పేస్తుంది" అని ప్రకటించింది. సునీతకు ఆశ్చర్యం వేసింది. మోహన, ఇంత భాష ఎప్పుడు నేర్చింది అని. సునీత ఆశ్చర్యం నుండి తేరుకోకముందే "సున్నిత మైన జీవితపు సూత్రాలు మర్చిపోయావు నువ్వు. తొమ్మిదేళ్ళుగా ఒక శవంలాంటి జ్ఞాపకాన్ని లోపల పెట్టుకొని బ్రతుకుతున్నావు" అంది. సునీత కళ్ళలో ఒక్కసారిగా నీళ్ళు తిరిగాయి. దుఃఖం తోసుకొచ్చింది. అందంగా పాక్ చేసిన ముఖం, నిముషాల్లో పగిలిన నీళ్ళకుండ అయింది. సుందరం అనే తన మనిషి గుర్తుకొచ్చాడు. అతని ట్రాజెడీ గుర్తు కొచ్చింది. బంజారాహిల్స్ ఒకానొక రోడ్డుపై, బ్యూటీ క్లినిక్ బయట, చీరచెంగును, ముఖం చుట్టూ కప్పుకొని, పొగిలిపొగిలి ఏడ్చే ముప్పయి అయిదేళ్ళ సునీత,

ఆమె వైపు నిస్సహాయంగా చూసే చెల్లెలు; ప్రవహించే నగరం, ఆ దృశ్యాన్ని పెద్దగా పట్టించుకోలేదు. మోహనకు ఎందుకో ఆమెను దగ్గరకు తీసుకోవాలనిపించింది. ఊహు, ఈ కొత్త జీవితపు రూల్స్ ప్రకారం, అంత సున్నితంగా ఉండకూడదు. ఏడ్చేవాళ్ళను ఓదార్చకూడదు. ఈ ఏడుపులన్నీ ఎక్సెస్ లగేజీ లాంటివి. సునీత, అట్లా ఏడుస్తూనే ఉంది. "సుందరం ట్రాజీడీని మరిచిపోవాలక్కా! అంతేకాదు సాయంకాలం మనం హరిప్రసాద్‌గారి ఇంటికి వెళుతున్నాము. అమ్మ, పిన్ని చెప్పమన్నారు. పొరపాటున కూడా సుందరం గురించి చెప్పకూడదని". మోహన గొంతు కటువుగా ఉంది. పది నిముషాల తరువాత సునీత తేరుకొంది. కళ్ళు తుడుచుకొంది. ఇద్దరూ పక్కనే ఉన్న కాఫీ షాపుకు వెళ్ళారు. మోహన అక్క కళ్ళలోకి చూసింది. తడిచిన పూల చెట్లలా ఉన్నాయి ఆ కళ్ళు. కటువుగా ఉండలేకపోయింది. "సుందరం సంగతులేమిటి? నార్మల్ అయ్యే చాన్సు ఉందా?" అంది మోహన. "ఎవరు చెప్పగలరు. నేనైతే మిరకిల్స్‌ని నమ్ముతాను" అంది సునీత. ఆ మాటలు అంటున్నప్పుడు ఆమె కళ్ళలో వెలుగు తళుక్కుమంది.



ముందుకు వంగి, సునీత మెడచుట్టూ చేతులు వేసి, నుదిటిపై ముద్దు పెట్టింది మోహన.

"సునీ, సుందరం కథని ఇక ముగించెయ్యి. ప్రపంచం ఎట్లా మారుతుందో చూస్తున్నావుగా. సుందరంలాంటి వాళ్ళ కాలం కాదిది. నువ్వు కూడా, కొత్తగా జీవించడం మొదలుపెట్టు. ఎంజాయ్ చెయ్యి. షాపింగ్‌లు చెయ్యి. సిటీ అంతా తిరుగు. మాల్స్, మల్టీప్లెక్స్, మంచి మంచి హోటల్స్ నీ యిష్టం. లాప్‌టాప్ కొనుక్కో. చాటింగ్ మొదలుపెట్టు. అసలు నీకు టైమే తెలియదు. ఒకసారి పబ్‌కు తీసుకెళతాను. ఆ థ్రిల్లే వేరు".

"ఈ హరిప్రసాద్ సంబంధం ఒప్పుకో. కారు, బంగళా, లైఫే మారిపోతుంది. చిన్నదాన్ని నీతో అనకూడదు గానీ, సెక్స్ ఈజ్ ఎ వండర్‌ఫుల్ గిఫ్ట్ ఆఫ్ గాడ్. రాత్రంతా వెచ్చగా అతన్ని చుట్టేసుకొని... జస్ట్ ఇమాజిన్; ఈ నాస్టాల్జియాలు, ఈ వెక్కి వెక్కి ఏడవటాలు, తేడాను గమనించు. కొత్త జీవితాన్ని అంగీకరించు".

సునీత, మోహన కూర్చున్న బల్లలకు దూరంగా ఇద్దరు టీనేజర్లు కూర్చున్నారు కాఫీ సిప్ చేస్తూ. ఆ కుర్రాడు, ఎదురుగా కూర్చున్న అమ్మాయి జీన్‌పాంటుకు, టీ షర్టుకు మధ్య అనాచ్ఛాదంగా ఉన్న నడుమును టికిల్ చేస్తున్నాడు. ఆమె చెవిలో ఫోర్నో జోక్ ఏదో చెప్పినట్లున్నాడు. "ఛీ... నాటీ" అంటూ సిగ్గు పడుతూనే ఎంజాయ్ చేస్తుంది ఆ అమ్మాయి. "ఇదంతా మామూలే పట్టించుకోవద్దు" అంది మోహన. పట్టించుకోకుండా ఉండలేకపోయింది సునీత. ఆ కుర్రవాడి చూపులు, సునీత జాకెట్టు మధ్యలో ఇరుక్కుపోయాయి. మధ్యలో కన్ను గీటుతున్నాడు (అసహ్యంగా అతని వైపు చూసింది).

హరిప్రసాద్ అందంగానే ఉంటాడు అనుకుంది సునీత. ముఖమంతా నిండిపోయిన నోరు. పెదవులు ఎప్పుడూ నవ్వుతున్నట్లే ఉంటాయి. పళ్ళు మిలమిలలాడుతూ, టూత్‌పేస్ట్ యాడ్‌లో మనిషిలా ఉంటాడు, అనుకొంది.

సునీత అమ్మ, పిన్నివాళ్ళు హాల్లో కూర్చున్నారు. సునీతను ఇంటిలోపలికి తీసుకెళ్ళాడు హరిప్రసాద్. ఇంటిని పరిచయం చేస్తున్నాడు. బెడ్‌రూమ్ చూపిస్తున్నప్పుడు, నడుంచుట్టూ చేతులు వేసి, దగ్గరకు లాక్కున్నాడు. దూరంగా జరిగింది సునీత. పెళ్ళి నిర్ణయం అయిపోయినట్లే మాట్లాడుతున్నాడు హరిప్రసాద్.

బాల్కనీలో నిలబడి, దూరంగా కనిపించే హైటెక్ సిటీని చూపించి వివరిస్తున్నాడు. అతని మాటల్ని ఆపి, సుందరం గురించిన కబుర్లు చెప్పాలనిపించింది సునీతకు. పిన్ని కళ్ళు, హాలులోంచే ఆమెను వెంటాడుతున్నట్లు అనిపించింది. పిన్ని కోసంకాదు గానీ, ఈ హరిప్రసాద్‌లాంటివాడికి, సుందరం గురించి చెప్పడమేమిటి అనుకుంది. సుందరం, హరిప్రసాద్ కన్నా వందల అడుగుల ఎత్తులో ఉన్నాడు అనుకొంది.

"నువ్వు చాలా అందంగా ఉంటావు" అంటూ మెచ్చుకున్నాడు హరిప్రసాద్. "సినిమా హీరోయిన్ 'స్నేహ'లా, నిండుగా, సెక్సీగా..."

హఠాత్తుగా సునీత ముఖం బిగుసుకుపోయింది, కదలికలు ఆగిపోయినట్లుగా. ముఖం చుట్టూ మౌనాన్ని కప్పుకొంది. ఆ మౌనాన్ని చూసి భయపడ్డాడు హరిప్రసాద్. గుడిలో ఉండే అమ్మవారి విగ్రహంలా గంభీరంగా మారిపోయింది. "యూ ఆర్ వెరీ డిఫరెంట్" అని మెల్లగా నసిగాడు.

ఆమె వైపు చూడకుండా దూరంగా ఉన్న బిల్డింగ్‌ల వైపు చూస్తూ, ప్రకటనలు చదువుతున్నవాడిలా తన గురించి చెప్పుకుపోతున్నాడు. అతని భార్య గురించి, ఆమెతో గొడవల గురించి చెప్పాడు. ఆమె గయ్యాళితనంతో, అతను ఎంత నరకం చూశాడో వివరించాడు. ఆమెకున్న వివాహేతర సంబంధాల గురించి చెప్పాడు. యాభై యేళ్ళ సర్దార్జీతో ఆమెను రెడ్‌హాండెడ్‌గా హోటల్లో పట్టుకొన్న ముచ్చట చెప్పాడు. తన మంచితనం ఎలా నిరుపయోగం అయ్యిందో వివరించాడు. తనపై హెరాస్‌మెంటు కేసు పెట్టిన విషయం కూడా చెప్పాడు. దాదాపు రెండు లక్షలు ఖర్చుపెట్టి ఆ కేసు నుంచి బయటకు వచ్చినట్లు చెప్పాడు. విడాకులు తీసుకోలేదుగానీ, యిద్దరం విడిపోయినట్లే అని చెప్పాడు. ఆ కారణం చేత సునీతను రహస్యంగా గుడిలో మాత్రమే పెళ్ళి చేసుకోగలను, అని కూడా చెప్పాడు. చివరిగా తన తొమ్మిదేళ్ళ కూతురు గురించి చెప్పాడు. కూతురు బంగారుకొండ అని, దానికోసమే జీవిస్తున్నానని చెప్పాడు. ఇంకా చాలా విషయాలు చెప్పబోయాడు గానీ, ఎందుకో అతను చెబుతున్న మాటలు సునీత వినడం లేదేమో అనిపించింది. చుట్టూ మౌనపు కోటను కట్టుకొన్న రాజకుమార్తెలాగా ఉంది సునీత.

అతని మాటల్ని ఆపి, సుందరం గురించిన కబుర్లు చెప్పాలనిపించింది సునీతకు. పిన్ని కళ్ళు, హాలులోంచే ఆమెను వెంటాడు తున్నట్లు అనిపించింది. పిన్ని కోసంకాదు గానీ, ఈ హరిప్రసాద్‌లాంటివాడికి, సుందరం గురించి చెప్పడమేమిటి అనుకుంది. సుందరం, హరిప్రసాద్‌కన్నా వందల అడుగుల ఎత్తులో ఉన్నాడు అనుకొంది.

కింద హాలులో ముహూర్తాల గురించి మాట్లాడుతుంది, సునీత పిన్ని. సునీత "నాకు కొంచెం టైముకావాలి ఆలోచించుకోవాలి" అంది, సీరియస్‌గా ముఖంపెట్టి. హరిప్రసాద్ నిరుత్సాహపడ్డాడు. అయితే ఆ నిరుత్సాహాన్ని బయట పడనీయకుండా, సునీతకు గుడ్‌బై చెబుతూ "ఇవాళ నుంచి ఈ యిల్లు నీది" అన్నాడు సినిమాటిక్‌గా. ఆ మాటలకు సునీత తల్లి, పిన్ని ఎంతో ముచ్చటపడ్డారు.

రెండు నెలలు గడిచిపోయాయి. సునీత యింకా తన నిర్ణయాన్ని చెప్పలేదు. హరిప్రసాద్ వారానికొకసారి వాళ్ళ యింటికి వస్తున్నాడు. వచ్చినప్పుడల్లా సునీతకోసం ఖరీదైన కానుకలు తెస్తున్నాడు. సెల్‌ఫోన్, సెంట్, చీరలు; సునీత వాటన్నిటిని, ఒకదాని తరువాత ఒకటి పేర్చుతోంది. "లవ్ ఇన్ ఇన్‌స్టాల్‌మెంట్సు" అని మోహన జోక్ చేస్తుంది.

పార్క్‌లేన్‌లో సునీత తల్లి 'పార్క్‌లైన్ 27' అంటూ ఒక బోతిక్ షాపును తెరిచింది. ఎక్కడెక్కడినుంచో అందమైన చీరలు తెప్పించింది. ఆ చీరల షాపు, అందమైన రంగుల కలలా అనిపించింది సునీతకు. వందలాదిగా ఆడవాళ్ళు వాళ్ళను చూస్తే ముచ్చటగా ఉంది సునీతకు. డబ్బున్న ఇళ్ళకు చెందినవాళ్ళే కాకుండా, కాలేజీ అమ్మాయిలు ఎక్కువ

రావటం గమనించింది సునీత. వాళ్ళను చూస్తే ఆనందంగా ఉంది సునీతకు. అందమైన కవిత్వం వింటున్నట్లు ఉంటుంది, వాళ్ళ మాటల్ని వింటున్నప్పుడు. (ఇంగ్లీషు, ఉర్దూ కలిసిన తెలుగు) నెల రోజుల్లో ఆ షాపుకు మంచి పేరు వచ్చింది. మంచి అభిరుచి ఉన్న కస్టమర్లు అక్కడకు వస్తారని పేరు వచ్చింది. ఉద్యోగాలు చేసే ఆడవాళ్ళు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు చేసే అమ్మాయిలు, డాక్టర్లు, లాయర్లు, జర్నలిస్టులు, ఆఖరికి ఉద్యమాల ఆడవాళ్ళు; సునీతకు ఇదంతా కొత్త ప్రపంచం. పెళ్ళి మాత్రమే కాకుండా ఆడవాళ్ళకు వేరే ప్రపంచం ఉందని, తెలియజేసే సమూహం వాళ్ళు.



ఒకరోజు, ఒక పాతికేళ్ళ అమ్మాయి, ఆమె బాయ్‌ఫ్రెండ్ వచ్చారు. ఆమె కళ్ళలో దుఃఖం, మాటిమాటికీ కళ్ళు తుడుచుకుంటుంది. కానీ గొంతు మాత్రం స్థిరంగా ఉంది. చీరలు వెతకటం ఒక నెపం. వాళ్ళ పరిచయపు చివరి ఘట్టాన్ని రాస్తున్నారు.

"ఇక్కడ స్నేహాలేవీ శాశ్వతం కాదు. అన్నీ తాత్కాలికాలే..." అంది, ఆ అమ్మాయి. అతని వైపు కాకుండా ఎటో చూస్తూ. "ఇవాళ మన లాస్ట్ సప్పర్, నీ యిష్టమైన రెస్టారెంట్‌ని సెలక్ట్ చెయ్యి, పబ్, డాన్స్, నీ యిష్టం. మిగిలిపోయిన రాత్రి కూడా నీదే. రేపటి నుంచి, నువ్వెదురైనా, నువ్వెవరో తెలియనట్లే ఉంటాను". వాళ్ళ కథలో చివరి వాక్యం రాసేసింది ఆ అమ్మాయి.

"ఇళ్ళు, గదులు ఖాళీ చేసినంత సులువుగా..." అతను సన్నగా గొణుకుతున్నాడు. "దిగులుగా ఉంది, గాయమయి, నెప్పి పెడుతుంది" అన్నాడు కన్నీళ్ళ మధ్య అతను.

"సెకండరీ షేరు మార్కెట్లు, హెడ్‌ఫండ్ రూపాయి నడకల గురించి, నువ్వు పంపే బోడి రిపోర్టులకు నెలకు 200 డాలర్లు కూడా రావు. ఖరీదైన ధమ్ బిరియాని కూడా కొనివ్వలేవు..." ఆ అమ్మాయి స్పష్టంగా చెబుతుంది. అతను సన్నగా నవ్వబోయేడు గానీ, నవ్వు రాలేదు. మౌనంగా షాపును, (ఆ అమ్మాయిని) వదలి, పార్క్‌లేన్ రోడ్డుపైనున్న వందలాదిగా ఉన్న జనంలో కలిసిపోయాడు. (సునీతకు, ఎందుకో మోహన గుర్తుకొచ్చింది. ఇది 'మోహన నగరం' అనిపించింది)

ఒక శనివారం మధ్యాహ్నం, సునీత తల్లి హడావుడిగా వచ్చి, షాపు మూసివేసి, 'ఒక చోటకు వెళ్దాం' పద అని బయలుదేరదీసింది.

హరిప్రసాద్ ఇంటి ముందు షామియానా వేసి ఉంది. చాలామంది దిగులుముఖాలు వేసుకొని కూర్చున్నారు. పిన్ని పెద్దగా ఏడుస్తుంది. హరిప్రసాద్ భార్య (విడిపోయిన) ఆత్మహత్య చేసుకొంది. బ్లేడుతో చెయ్యి కోసుకొని. ఇంటిముందు పడుకోబెట్టారు. ఆమె ముఖం ఖాళీగా ఉంది. ఆమె దేహంలోంచి (ఆత్మలోంచి) శక్తిని మొత్తం తోడివేసినట్లుగా అనిపించింది. గుమ్మం ముందు తొమ్మిదేళ్ళ పాప దిగులుగా కూర్చుంది. ఆ సందర్భం, ఇంకా కొత్తగా, అర్థంకానట్లుగా చూస్తుంది. ఆడవాళ్ళు చాలామంది దిగులు నటిస్తున్నారు. ఆశ్చర్యంగా హరిప్రసాద్ లోపలి గదిలో పెద్దపెద్దగా ఏడుస్తున్నాడు. ఎప్పుడెప్పటివో జ్ఞాపకాల్ని బయటకు తెస్తూ ఏడుస్తున్నాడు. ఎందుకో అదంతా నాటకంలోని సన్నివేశంలా తోచింది సునీతకు. ఆమెను (కిరణ్ ఆమె పేరు) అక్కడ నుంచి దొంగలించుకువెళ్ళి ఎక్కడైనా, దాచిపెట్టాలనిపించింది సునీతకు. ఈ ఏడుపులన్నీ ఆమెపై పదే పదే జరుగుతున్న హత్యాప్రయత్నాలు అనిపించింది. పది నిముషాల తరువాత, శవం దగ్గర ఉన్న ఆడవాళ్ళు అందరూ ఒక్కసారిగా ఇంట్లోకి పరిగెత్తారు. హరిప్రసాద్‌కు స్పృహ తప్పిందంట(!) ఒంటరిగా ఉన్న శవం పక్కనే కూర్చుంది సునీత. కళ్ళలోంచి తోసుకు వచ్చే కన్నీళ్ళను బలవంతంగా ఆపివేసింది. కళ్ళు తుడుచుకుంది. ఆమె (కిరణ్) నుదిటిని ముద్దుపెట్టుకొంది. "ఎంత అందమైన ముఖం మీది!" అని ఆమెను కాంప్లిమెంటు చెయ్యాలనిపించింది. చనిపోకముందు, ఆమెను కలుసుకోలేకపోయినందుకు దిగులుపడింది.

ఆమె ముఖంలో ఇంకా ఏదో ఆత్మీయత మిగిలి ఉందనిపించింది. అమ్మతనం ఇట్లాగే ఉంటుంది కదా అనుకుంది. ఎందుకో ఆమెతో సంభాషించాలనిపించింది సునీతకు. ఈ మొత్తం సిటీలో తన గుండెకు దగ్గరగా ఉండే ఆత్మీయురాలు ఆమే అనిపించింది సునీతకు. శవం నుదిటిపై చెయ్యివేసి, ప్రాణస్నేహితురాలుతో కబుర్లు చెప్పినట్లుగా; ఆమెతో మాట్లాడటం మొదలుపెట్టింది.

ఆమె (కిరణ్) నుదిటిని ముద్దుపెట్టుకొంది. "ఎంత అందమైన ముఖం మీది!" అని ఆమెను కాంప్లిమెంటు చెయ్యాలనిపించింది. చనిపోకముందు, ఆమెను కలుసుకోలేకపోయినందుకు దిగులుపడింది. ఆమె ముఖంలో ఇంకా ఏదో ఆత్మీయత మిగిలి ఉందనిపించింది. అమ్మతనం ఇట్లాగే ఉంటుంది కదా అనుకుంది. ఎందుకో ఆమెతో సంభాషించాలనిపించింది సునీతకు.

తొమ్మిదేళ్ళుగా సునీత గుండెలో దాచుకున్న దుఃఖాన్ని బయటకు తీసింది. సుందరం గురించి చెప్పటం మొదలుపెట్టింది. కోర్టు ఆవరణలో సుందరాన్ని పోలీసులు కాల్చివేసిన రాత్రి గురించి చెప్పింది. వెన్నుపూసలో దిగిన నాలుగు బుల్లెట్ల గురించి చెప్పింది. ఇప్పటికీ, ఖాళీ చూపులతో, ఏ కదలికా లేని శరీరంతో, హాస్పటల్‌లో పడి ఉన్న సుందరం గురించి చెప్పింది.

సుందరం వాళ్ళ గ్రామం గురించి చెప్పింది. పురాస్వప్నంలాంటి సుందరం యింటిని గురించి చెప్పింది. నిజం అమ్మలాంటి, సుందరం అమ్మ గురించి చెప్పింది. సుందరాన్ని, సునీతను పక్కన కూర్చోబెట్టుకొని, ఆమె గోర్కీ 'అమ్మ' నవల్ని చదివి వినిపించిన రోజుల గురించి చెప్పింది. చెరువుల్లో ఈతలు కొట్టిన, చేలగట్ల వెంట గంభీరమైన విషయాలు మాట్లాడుకుంటూ నడిచిన రోజుల గురించి చెప్పింది.

కాలేజీలో సుందరం ఎంత ఉద్రేకంగా ఉండేవాడో చెప్పింది. మధ్యలో అదృశ్యమై మళ్ళీ, మళ్ళీ ప్రత్యక్షమయ్యే సుందరం సాహసాల గురించి చెప్పింది. ఒక వేసవి సాయంకాలం ఒక ప్రజాకవి ఎదుట, వాళ్ళిద్దరు పెళ్ళి చేసుకోడానికి నిర్ణయించుకొన్న ముచ్చట చెప్పింది.

సుందరం అచేతనమైన (కోమాలో ఉన్న) శరీరానికి యింకా సేవలు చేస్తున్న సుందరం తల్లి గురించి కూడా చెప్పింది. 'మిరకిల్స్' జరుగుతాయనే తన నమ్మకం గురించి కూడా చెప్పింది. చివరగా "కిరణ్మయి గారు, నేను అద్భుతం కోసం ఎదురుచూస్తున్నాను. సుందరం కోసం ఎదురుచూస్తున్నాను" అంది, తీవ్రమైన స్వరంతో.

ఆ చనిపోయిన మనిషి తన ముచ్చట్లన్నీ విన్నట్టే అనిపించింది సునీతకు. చాన్నాళ్ళ తరువాత, తన లోపలి దుఃఖమేదో కాస్త ఉపశమించినట్లనిపించింది.

హరిప్రసాద్‌కు స్పృహ వచ్చింది. ఆడవాళ్ళందరూ బయటకు వచ్చారు. శవం పక్కన, సునీత, ఆ దృశ్యం చూసి, సునీత తల్లి ఆనందపడింది. సునీత కొత్త జీవితపు గాడిలో పడినట్టే అని నిట్టూర్చింది. •